క్లుప్తంగా

మంత్రి మేరుగ తనయుడు కిరణ్ నాగ్‌కి డాక్టరేట్



వేమూరు: రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున కుమారుడు మేరుగ కిరణ్ నాగ్ ఆదివారం విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో పరిశోధనకు సంబంధించి కిరణ్ నాగ్ ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, ఉన్నత విద్యా మండలి కౌన్సిల్ చైర్మన్ హేమచంద్రారెడ్డి కిరణ్ నాగ్‌ని అభినందించారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసిన బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో శ్రావణ మాసం నాలుగవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అభయప్రధాయినిగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దేవాలయం కిటకిటలాడింది. ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి, సిబ్బంది ఉన్నారు.

నేడు ఏబీఆర్ కళాశాలకు నాక్ కమిటీ సభ్యుల రాక

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో వివిధ అంశాల పరిశీలనకు సోమ, మంగళవారాల్లో జాతీయ మదింపు, గుర్తింపు సంస్థ(నాక్) నుంచి ముగ్గురు సభ్యుల కమిటీ రానున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టీసీ రవిచంద్ర కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ చైర్మన్, తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ ముత్తుకలింగన్ కృష్ణన్, సమన్వయ కర్తగా ఢిల్లీ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉజ్జ్వల సింగ్, సభ్యురాలు థానే రీనా మోహతా కాలేజ్ ప్రిన్సిపల్ సతీందర్ కౌర్ గుజ్జాల్ విచ్చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు కళాశాలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం 'రేపల్లె' అధ్యక్షుడిగా వెంకటకృష్ణ



నిజాంపట్నం: బీసీ సంక్షేమ సంఘం రేపల్లె నియోజికవర్గ అధ్యక్షుడిగా మోర్ల వెంకటకృష్ణ ఎంపికయ్యాడు. నియామక పత్రాన్ని ఆదివారం బొర్రావారిపాలెంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆయనకు అందజేశారు. తనను నియోజికవర్గ అధ్యక్షుడిగా నియమించిన కేసన శంకరరావుకు వెంకటకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడి, తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణను పలువురు బీసీ సంఘ నాయకులు అభినందించారు.

వేమూరులో 144 సెక్షన్ ఆంక్షలు అమలు

వేమూరు: వేమూరు నియోజకవర్గంలో సోమవారం 144 సెక్షన్ అమల్లో ఉందని వేమూరు ఎస్‌ఐ నాగారాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో ముగ్గురు కంటే ఎక్కువ మంది తిరిగితే చర్యలు తీసుకోవడం జరుగుతందన్నారు. ప్రజలు గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

కేబుల్ వైర్లు దగ్ధం

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలోని స్క్రూబ్రిడ్జి వద్ద 11 కేవీ విద్యుత్ స్తంభానికి ఉన్న వివిధ నెట్‌వర్క్‌లకు సంబంధించిన కేబుల్ వైర్లు దగ్ధమయ్యాయి. స్థానికులు నులకపేట విద్యుత్ శాఖ ఏఈ షణ్ముఖకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. వైర్లు రెండు లేయర్లు లేచిపోవడం గమనించి వాటిని మార్చారు. గత వారం రోజుల్లో ఇలా రెండో సారి జరగడంతో విద్యుత్ శాఖ అధికారులు కేబుల్ వైర్లతో ఆందోళన చెందుతున్నారు.

అధికం అనర్థం..!



ఎరువులు కలుపుతున్న రైతు

- పెరుగుతున్న ఎరువులు, పురుగు మందుల వినియోగం
- సారం కోల్పోతున్న భూమి–నాణ్యతలేని ఉత్పత్తులు
- పిట్టలవానిపాలెం మండలంలో 11,400 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు



ఎరువు వెదజల్లుతున్న రైతు

పిట్టలవానిపాలెం: బస్తాలకు బస్తాలు ఎరువులు, డబ్బాలకు డబ్బాలు రసాయనిక పురుగు మందులు వాడడం వల్ల పంటలో తెగుళ్లు నశించక పోగా.. కొత్త తెగుళ్లు పుట్టుకొస్తున్నాయి. ఏటా అధిక శక్తి కలిగిన మందులను రైతులు పంటలో పిచికారీ చేస్తూ పోతున్నారు. దీంతో పెట్టుబడులు పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులపైనా ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పిట్టలవానిపాలెం మండలంలోని రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులు విచక్షణా రహితంగా వినియోగిస్తున్నారు. దీంతో ఏటా పెట్టుబడి వ్యయం రెట్టింపవుతోందని అధికారులు చెబుతున్నారు.

మండలంలో పరిస్థితి ఇదీ..

మండలంలో 11,400 ఎకరాలలో ఖరీఫ్ వరి సాగవుతోంది. రైతులు అవసరానికి మించి 15 నుంచి 25 శాతం అధికంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడుతున్నారు. వరి సాగు ఖర్చులకంటే.. రసాయనిక ఎరువుల ఖర్చే అధికంగా ఉంటోంది. సాధారణంగా ఎకరాకు 2 బస్తాల డీఏపీ, రెండున్నర బస్తాల యూరియా, బస్తా పొటాష్ సరిపోతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కానీ, రైతులు అంతకుమించి ఎరువులు వాడుతున్నారు. దీని వల్ల సారం క్షీణించి, జీవం లేని భూమిగా తయారవుతోంది. రైతులకు వ్యయం పెరగడంతో పాటు పురుగు మందులను తట్టుకునే సామర్థ్యం కీటకాలకు పెరుగుతోంది. ఫలితంగా ఎన్ని మందులు వాడినా కీటకాలు, తెగుళ్లు నశించవు.

వర్మీ కంపోస్టుతో మేలు..

రసాయన ఎరువుల వాడకం తగ్గించడంతో పాటు భూసారం పెంచేలా వ్యవసాయశాఖ రైతులను ప్రోత్సహిస్తోంది. రాయితీపై వర్మీ కంపోస్టు యూనిట్లు అందిస్తున్నా.. వాటిని రైతులు తీసుకోవడం లేదు. వర్మీ కంపోస్టు ఎరువుల వల్ల పంటకు ప్రయోజనంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను సాధించ వచ్చని వ్యవసాయశాఖ అధికారులు ప్రచారం చేస్తున్నా.. రైతులు ఆసక్తి చూపడం లేదు. స్వల్ప సంఖ్యలో మాత్రమే వీటిని అందుకుంటున్నారు. ప్రస్తుతం సాగు చేస్తున్న వరిలో 75 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. నిబంధనల మేరకు వీరు ఆయా పథకాలను అందుకునేందుకు సాంకేతికంగా అవకాశం లేదు.

అధికంగానే ఎరువుల వినియోగం



వరికి ఎరువుల అధికంగానే వినియోగిస్తాం. ఎకరం వరికి దుక్కిలో డీఏపీ బస్తా, యూరియా అరబస్తా వేస్తాం. ఇవి కాక రెండు బస్తాలు కాంప్లెక్స్ ఎరువులతో పాటు రెండు బస్తాల యూరియాను వాడతాం. ఒక బస్తా పొటాష్ వాడతాం. వ్యవసాయ శాఖ అధికారులు ఎరువుల వినియోగం తగ్గించాలని అవగాహన కల్పిస్తూనే ఉన్నారు.

–అప్పిరెడ్డి, రైతు, పిట్టలవానిపాలెం.

పశువుల ఎరువు వినియోగం తగ్గింది



గతంలో ప్రతి ఇంట్లో పాడి పశువులు ఉండేవి. అందువల్ల పశువుల ఎరువును తప్పనిసరిగా పంటకు వేసేవారు. ఇప్పుడు పశువుల ఎరువు వాడకం తగ్గిపోయింది. డీఏపీ, కాంప్లెక్సు ఎరువులతో పాటు యూరియాను అధికంగా వాడక తప్పడం లేదు.

–రామిరెడ్డి, కౌలురైతు, పిట్టలవానిపాలెం.

భూసార పరీక్షలకు అనుగుణంగా



భూ సారానికి అనుగుణంగానే ఎరువులు, పురుగు మందులను వినియోగించాలి. విచక్షణా రహితంగా ఎరువులు వాడడం వల్ల రైతులకు పెట్టుబడి పెరగడంతో పాటు క్రమేపి భూ సారం కోల్పోయి, పంటలకు పనికి రాకుండా పోతుంది. మట్టి నమూనాల సేకరణలో ప్రతి ఏటా చౌడు భూముల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఎరువులు అధికంగా వాడడం వల్ల నష్టమే తప్ప, ఎలాంటి ప్రయోజనం ఉండదు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తే సాగు వ్యయం తగ్గి భూ సారం పెరుగుతుంది. రైతులను ఈ విషయంపై చైతన్యపరుస్తున్నాం. ఈ ఖరీఫ్‌లో నైనా రైతులు ముందుగానే మేల్కొంటే పెట్టుబడులు తగ్గించుకునేందుకు వీలుంటుంది.

–సత్యానంద్, వ్యవసాయశాఖాధికారి, పిట్టలవానిపాలెం.

గ్యాస్ ఆధారిత దహనవాటిక ప్రారంభం

- మనిషి చివరి మజిలీ మహాప్రస్థానం
- సౌకర్యవంతంగా తీర్చిదిద్దటం అభినందనీయం
- రూ.30.50 లక్షలతో ఆధునీకరించటం గొప్ప విషయం
- క్రిమేషన్ చాంబర్, మార్చురీ గది ప్రారంభంలో ఎమ్మెల్యే శివకుమార్



గ్యాస్ ఆధారిత దహనవాటికను ప్రారంభిస్తున్న తుమ్మల గోపీచంద్. పక్కన ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: మనిషి ఎంత ఉన్నతంగా బతికినా చివరి మజిలీ మహాప్రస్థానమేనని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పేదల దగ్గర్నుంచి సంపన్నుల వరకు జీవనప్రస్థానాన్ని ఎలా గడిపినా శరీరంలోంచి జీవుడు వెళ్లిపోయాక అంతిమంగా చేరుకొనేది శ్మశానవాటికేనని గుర్తుచేశారు. అలాంటి శ్మశానవాటికలు దీర్ఘకాలంగా నిర్లక్ష్యానికి గురైనట్టు చెప్పారు. మనసున్న పెద్దలు కొందరు పూనుకుని సేవాసమితిగా ఏర్పడి దాతల సహకారం తీసుకుని వాటిని సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దటం అభినందనీయం అన్నారు. పాండురంగపేటలోని శ్మశానవాటికలో దాతల సహకారంతో రూ.26 లక్షలతో నిర్మించిన గ్యాస్ ఆధారిత దహనవాటిక (క్రిమేషన్ ఛాంబర్)ను, రూ.4.50 లక్షలతో నిర్మించిన మార్చురీరూమ్‌ను ఆదివారం ప్రారంభించారు. టెరా సాఫ్ట్‌వేర్ ఎండీ తుమ్మల గోపీచంద్ దహనవాటికను ప్రారంభించగా, ఎమ్మెల్యే శివకుమార్ స్విచ్ ఆన్ చేశారు. మార్చురీ రూమ్‌ను 25వ వార్డు కౌన్సిలరు తాడిబోయిన రామయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మహాప్రస్థాన సేవాసమితి అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాప్రస్థాన సేవాసమితి గ్యాస్ ఆధారిత దహనవాటికను, శ్మశానంలోనే భౌతికకాయాలను భద్రపరిచేందుకు మార్చురీ రూమ్‌ను నిర్మించటం మరో ముందడుగుగా చెప్పారు. దాతలు డబ్బులు ఊరికే ఇవ్వరంటూ తమ విరాళానికి సార్థకత కలుగుతుందన్న నమ్మకం ఏర్పడితేనే ముందుకొస్తారని చెప్పారు. సేవాసమితిపై అంతటి విశ్వాసం ఉన్నందునే రూ.30 లక్షలకు పైగా నిధులు సమకూర్చినట్టు తెలిపారు. పరిసరాల్లోని ప్రజల వినతి మేరకు తన వంతుగా రూ.25 లక్షలు కేటాయించి ప్రహరీగోడను నిర్మించినట్టు చెప్పారు. సేవాసమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ స్వాగతం పలికారు. టెరా సాఫ్ట్‌వేర్ ఎండీ తుమ్మల గోపీచంద్, సేవాసమితి ఉపాధ్యక్షుడు మువ్వా సత్యనారాయణ, కౌన్సిలర్ షేక్ ఇస్మాయిల్, గ్యాస్ ఛాంబర్ తయారీసంస్థ గ్లోబల్ ఎన్విరో కేర్ ప్రాజెక్ట్ మేనేజరు అర్జిత్‌సింగ్ మాట్లాడారు. ఇదే సభలో విరాళాలు సమకూర్చిన దాతలను ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా సత్కరించారు. పట్టణ ప్రముఖుడు సూరెడ్డి సూర్యమోహన్, సంస్థ కోశాధికారి తుమ్మల బాపయ్యచౌదరి, సంయుక్త కార్యదర్శులు చదలవాడ శంకరప్రసాద్, ఆర్ఎస్ శంకరరావు, యలవర్తి గంగాధరరావు, బండి సాంబశివరావు, ముద్దా భక్తుని రమణయ్య, కో–ఆప్షన్ మెంబరు వుయ్యూరు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

దళితులపై దాడుల్ని తిప్పికొట్టాలి



అనిల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

నెహ్రూనగర్: నేటికీ దళితులపై దాడులు తగ్గలేదని, దళిత రక్షణ చట్టాలు, ప్రత్యేక న్యాయస్థానాలు బాధితులకు న్యాయం చేయలేకపోతున్నాయని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ 32వ సంస్మరణ సభలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో దళిత పల్లెవీరులు రక్షణ దళాల్ని ఏర్పాటు చేసుకొని దాడుల్ని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 32 ఏళ్ల కిందట ఎనిమిది మందిని దారుణంగా చంపిన చుండూరు మారణకాండ కేసులో ఇప్పటికీ హంతకులకు శిక్ష పడకపోవడం, దళితుల ఉనికికే ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా చుండూరు పల్లె వీరుడు కొమ్మెర్ల అనిల్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు, చుండూరు దళిత పోరాట కమిటీ నాయకులు జాలాది మోజెస్, దేవరపల్లి వీరయ్య, చుక్క సునీలరావు, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు బుస్సా రత్నప్రసాద్, కొసనం రాము, భూపతి సునీల్ కుమార్, పొందుగల ప్రకాష్, ఐలా మాణిక్యరావు, సాతులూరి రామాంజయనేయులు, మేళం భాగ్యరావు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థుల 'స్వచ్ఛతా' లఘుచిత్రం

తెనాలి: స్వచ్ఛతా పక్వాడ్‌లో భాగంగా స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం 'స్వచ్ఛత' పేరుతో లఘు చిత్రం తీశారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ నఫీసా అనే విద్యార్థినిపై క్లాప్ కొట్టారు. చిత్రకళా ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ దర్శకత్వం వహించారు. స్వచ్ఛతను పాటించినప్పుడే మనిషికి ఆయుష్షు, ఆరోగ్యం రెండూ ఉంటాయని నఫీసా చెప్పగా, విద్యార్థులు ప్లకార్డులతో నినాదాలు చేసిన సన్నివేశాన్ని చిత్రీకరించారు. పెద్దల అడుగుజాడల్లో నడవాలనీ, ఆరుబయట మలవిసర్జన చేయరాదనీ, నీటిని పొదుపుగా వాడాలనీ, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలనీ, గాలిని, భూమిని, నింగిని పరిశుభ్రంగా ఉంచుకోవాలనే సందేశంతో ఈ లఘుచిత్రాన్ని తీస్తున్నామని వెంకట్ తెలియజేశారు.

'కాళికా ప్రభాకర్' మృతి

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు గోనుగుంట్ల ప్రభాకర్ (67) ఆదివారం ఉదయం సాలిపేట భిక్షావతి బజారులోని నివాసంలో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాళికా వేషంలో ప్రసిద్ధుడైన ప్రభాకర్, పలు రాష్ట్రాల్లో తన అభినయంతో అభినవ కాళిక అన్న బిరుదును పొందారు. శుభకార్యాలు, దేవతా ఊరేగింపుల్లో నడిచి వెళుతుండే కాళిక వేషాన్ని ప్రభాకర్ ఒక మలుపు తిప్పారు. నృత్యంతో కొత్త పుంతలు తొక్కించారు. బీజాక్షరాలు నేర్చుకుని తానే నృత్యాభినయానానికి రూపకల్పన చేశారు. ప్రేక్షకులు ఆదరించటంతో ఇక వెనుదిరిగి చూసుకోలేదు. మూడు దశాబ్దాలు కాళికా వేషధారణలో భక్తులను ఆనందింపజేశారు. వయసు మీదపడటంతో గత కొన్నేళ్లుగా విశ్రాంత జీవనం చేస్తున్నారు.

చిన్నారులకు చెస్ పోటీలు

తెనాలి: సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో చిన్నారులకు చెస్ పోటీలు నిర్వహించారు. నాగసాయిదివ్య, కొత్త లక్ష్మి, హర్షిత్, అందె తన్మయ, సాదిక, దీపిక, దినేష్‌రెడ్డి సూర్యనారాయణ, శశాంక్, మౌళి, ప్రభంజన్‌లు విజేతలుగా నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు వీరికి ప్రశంసాపత్రాలను అందజేశారు. సిక్స్ సిగ్మా చెస్ అకాడమీ డైరెక్టర్ మోచర్ల నిరంజన్ పర్యవేక్షించారు.

ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణ

తెనాలిటౌన్: బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఆవరణలో కల్యాణ మండపంలో బిక్షమయ్య గురూజీ పర్యవేక్షణలో ఈ నెల 12,13 తేదీలలో ఉచిత అంతర్ముఖ యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 12వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు, 13వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మహిళా వ్యక్తిత్వ వికాస యోగ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు సంపత్ గురూజీ 8919625862, ఎం.వి.రాఘవయ్య 9949844969, ఎం.వి.లక్ష్మి 7989757853లో సంప్రదించాలని కోరారు.

సామాజిక న్యాయం ముద్దు.. సనాతన ధర్మం వద్దు



నెహ్రూనగర్: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు ఉదయ్‌నిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని, అప్పుడే సమాజం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందంటూ చేసిన వ్యాఖ్యల్ని దళిత ప్రజా సంఘాల నాయకులు సమర్థించారు. లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం సామాజిక న్యాయం ముద్దు.. సనాతన ధర్మం వద్దు అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తరతరాలుగా భారతదేశంలో సనాతన ధర్మం అనే ముసుగులో మను వాదాన్ని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. రెండు, మూడు వర్గాల వారిని పైస్థాయిలో నిలిపేందుకే ఇది ఉపయోగపడుతోందని విమర్శించారు. 85 శాతంగా ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలను అనేక రూపాల్లో వేధింపులకు గురిచేసిన మను వాదాన్ని బలపరుస్తున్న సనాతన ధర్మాన్ని శాశ్వతంగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాగళ్ల ప్రకాష్, డాక్టర్ మద్దు అంకయ్య, నల్లపు నీలాంబరం, సుజాతరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలి



రిలే నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

వేమూరు: పార్లమెంట్ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి వర్ల దేవదాసు మాదిగ డిమాండ్ చేశారు. వేమూరులోని బాబు జగ్జీవన్‌రావ్ విగ్రహం వద్ద ఈ మేరకు ఆదివారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. దీక్షకు వివిధ కుల సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నేతలు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మూరాల వాసుదేవ గౌడ్, సోమరౌతు బ్రహ్మం, ఎమ్మార్పీఎస్ నాయకులు యల్లమాటి దాసు, ఆలపాటి రాజేష్, ఎలిషా పాల్గొన్నారు.

దొరలను ఎదురించిన ధీర మహిళ ఐలమ్మ



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బాపట్ల: సివంగిలా చిట్యాల ఐలమ్మ కొంగు నడుముకు చుడితే దొరతనం తోకముడిచిందని రజక సంఘాల ఐక్య వేదిక జిల్లా నాయకుడు, న్యాయవాది అంగలకుదురు నటరాజన్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీనివాసరావు కాలనీలో చిట్యాల ఐలమ్మ వర్ధంతిని సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పలువురు నేతలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఐలమ్మ కొడవలి చేతబడితే పీడిత జనం కడలిలా తరలివచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి ఉప్పల దిన్నే గోపినాథ్ మాట్లాడుతూ ఆడదానిని అలుసుగా చూసిన వారి కంట్లో ఐలమ్మ నలుసుగా మారిందన్నారు. ఆమెను నేటి తరం ఆదర్శంగా తీసుకుని, ధైర్యంగా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం నేతలు పులిగడ్డ శ్యామ్‌ప్రసాద్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, వెంకట నాని, శ్రీరామ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ఏడుకొండలురెడ్డి

బాపట్లటౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని పాండురంగాపురంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు మేరకు.. బాపట్ల–పాండురంగా పురం రోడ్డులో కర్లపాలెం మండలం, పేరలి గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై వస్తూ అదుపు తప్పి బోల్తాపడ్డాడు. ఈ ఘటనలో ఏడుకొండలురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వీవీఐటీలో ఫస్టియర్ తరగతులు ప్రారంభం



నంబూరు వీవీఐటీలో విద్యార్థులతో కలసి పూజలో పాల్గొన్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: విద్య, ఉపాధి, నైపుణ్యాలతో పాటు విద్యార్థులకు మంచి అనుభూతులను, జ్ఞాపకాలను వీవీఐటీ కళాశాల అందజేస్తుందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో శనివారం రాత్రి నిర్వహించిన 2023–24 విద్యాసంవత్సరం మొదటి ఏడాది విద్యార్థుల తరగతులు ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ కళాశాలలోని మౌలిక వసతులు, సీమన్స్ ఎక్సలెన్స్, ఏపీఎస్ఎస్‌డీసీ నోడల్ కేంద్రం, గూగుల్ కోడ్ ల్యాబ్ పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం వలన విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన మెరుగైన నైపుణ్యాలను సంపాదించుకోవచ్చన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ పద్ధతులు అవలంభించేందుకు వారిలోని విలువలను పెంపొందించేందుకు వీవీఐటీ దోహదపడుతుందన్నారు. కళాశాల జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ మాట్లాడుతూ మెరుగైన భవిష్యత్తుకు విద్యార్థుల కృషి కీలకమని వారి కృషికి సరిపడా అన్ని వసతులను వీవీఐటీ కళాశాల అందిస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థిని పరిగణలోనికి తీసుకుని వారి ఉపాధి ఉన్నత విద్య కోసం ఉపాధికల్పన శిక్షణ విభాగం పనిచేస్తుందని తెలిపారు. మెరుగైన విద్యను నైపుణ్యంగా మార్చి విలువల కోసం పని చేసే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. విద్యతో పాటు అన్ని రంగాలలో ప్రావీణ్యం పొందేందుకు వీవీఐటీ చక్కటి అవకాశమని తెలిపారు. కళాశాల డీన్ డాక్టర్ ఎస్.కుమార స్వామి, డీన్ డాక్టర్ కె.గిరిబాబు, సెక్రటరీ సూర్యదేవర బదరీప్రసాద్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగానమ్మతల్లి ఆలయంలో కొలుపులు



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న నిర్వాహకులు

తెనాలిటౌన్: పట్టణ మారీసుపేటలోని ఆర్.ఆర్.నగర్‌లో రెండో లైనులో ఉన్న గంగానమ్మ తల్లి ఆలయంలో ఆదివారం కొలుపులు నిర్వహించారు. శ్రావణమాసం నాలుగో ఆదివారం రోజు ప్రతి ఏడాది కొలుపులు జరుపుతున్నామని పూజారి దేశబోయిన శివయ్య తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి ఆచారం ప్రకారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు చేశారు. వివిధ వేషధారణలతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రభ ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో శివయ్య పూజారి, మైలా హరికృష్ణ, కుమార్, మంగమూరి హైమారావు, ఆనంద కిషోర్, శంకర్, కిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో పడకేసిన పారిశుద్ధ్యం



మంచినీటి కొళాయి వద్ద నిలిచిన మురుగు



ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపు నీరు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలోని ప్రధానరహదారి పక్కన మురుగు నీరు నిలిచి, దోమల ఉధృతి అధికంగా ఉంది. దీనికి తోడు మంచినీటి కొళాయి వద్ద మురుగు నీరు నిలిచి అపరిశుభ్రంగా దర్శనమిస్తోంది. గ్రామ శివారు రెడ్లపాలెం రామమందిరం రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. అదేవిధంగా గౌడపాలెం నుంచి ఎస్సీ కాలనీ వైపు వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడి, అందులో వర్షపు నీరు నిలిచి, దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దోమల బెడద అధికమవడంతో రాత్రిళ్లు నిద్రలేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అంటున్నారు. అధికారులు పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.